క్లుప్తంగా

నేడు అవగాహన సదస్సు

పెనమలూరు: మందులు వాడ కుండా ఒంటి నొప్పుల నివారణపై ఆదివారం సదస్సు నిర్వహిస్తున్నామని యోగాశక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు కానూరు అశోక్‌నగర్‌లోని తమ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తామన్నారు. అన్ని వయస్సుల వారు ఈ అవగాహన సదస్సుకు రావచ్చని తెలిపారు. ఒంటి నొప్పులు కారణంగా చాలా మంది మందులు వాడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. తాము నిర్వహించే సదస్సులో ఆసక్తి కలిగిన వారు పాల్గొని ఒంటి నొప్పుల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో తెలుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90003 47369 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని అన్నారు.

డ్రెయిన్ పూడిక తీత పనుల పరిశీలన



పెనమలూరు: పెనమలూరులో పూడుకుపోయిన డ్రెయిన్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. గ్రామంలో జ్యోతి కాన్వెంట్ వద్ద నుంచి మసీదు ఆర్ అండ్ బీ రోడ్డు వరకు ఉన్న కచ్చా డ్రెయిన్ పూడుకు పోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సర్పంచి లింగాల భాస్కరరావు వెంటనే స్పందించి దాదాపు 500 మీటర్ల మేర ఉన్న కచ్చా డ్రెయిన్ పూడిక శనివారం తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షా కాలం నాటికి గ్రామంలో డ్రెయినేజీలు అన్నీ పూడిక తీయిస్తామన్నారు. గ్రామస్తులు డ్రెయిన్‌లలో వ్యర్థాలు వేయొద్దని కోరారు. గ్రామ పరిశుభ్రతకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు వీరంకి రాఘవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

సాక్షి ఎఫెక్ట్..

కంకిపాడు: పశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈడుపుగల్లు పశువైద్యాధికారి డాక్టర్ కె.మాధవరావు తెలిపారు. కుక్కల దాడిలో దూడ మృతి వార్తపై శనివారం ఆయన స్పందించారు. కుక్కలదాడిలో ఒక దూడ మృతి చెందగా గాయపడిన మరో దూడను ఆయన శనివారం పరిశీలించారు. ఈడుపుగల్లు పరిధిలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకున్నామన్నారు. కుక్కలకు సంతానం కలగకుండా ఆపరేషన్‌లు చేయించేందుకు పంచాయతీ అధికారి, వైద్యాధికారి, ఎన్‌జీఓలతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడగానే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ చేయించామన్నారు. వేసవి కావటంతో నీటి కోసం వీధి కుక్కలు ఇళ్లల్లోకి చేరుతున్నాయని, పశువులు, గొర్రెలు ఉన్న కాపరులు ఇళ్లు, దొడ్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేసుకుని జీవాలు, గేదెల ప్రాణ రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ధార్మిక, సామాజిక సేవ కార్యక్రమాలు విస్తృతం



హనుమాన్‌జంక్షన్ రూరల్: ధార్మిక, సామాజిక సేవ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ అన్నారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, వీహెచ్‌పీ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ నివాసానికి శనివారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ హిందూ మత విశిష్టత, గొప్పదనం, సంప్రాదాయలను మరింతగా కాపాడేందుకు, విస్తృతంగా ప్రచారం చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. సర్వమత సౌభ్రాతృత్వం, మత సామర్యం, మత స్వేచ్ఛ, లౌకికవాదం భారతదేశ గొప్పదనమని అలోక్ కుమార్ తెలిపారు. హిందు మతాన్ని దెబ్బతీసే కుట్రలను కూడా సహించబోమని పేర్కొన్నారు. ముందుగా పుట్టగుంట సతీష్ కుమార్ నివాసంలోని శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గోశాలలో మేలు జాతి గోవుల గూర్చి తెలుసుకున్నారు. గోమాతకు పూజలు చేశారు. ఆశా జ్యోతి వికలాంగుల సొసైటీలోని దివ్యాంగులకు ఉచితంగా వీల్ చైర్స్, కృత్రిమ అవయువాలను పంపిణీ చేశారు. వీహెచ్‌పీ ప్రతినిధులు రవికుమార్, దుర్గా ప్రసాదరాజు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రం మూత

- గత ప్రభుత్వంలో సంపద తయారీ ఫుల్
- కూటమి పాలనలో యూనిట్ మూత
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



కానూరులో శిథిలమైన సంపద తయారీ కేంద్రం



సంపదల తయారీ కేంద్రంలో నిరుపయోగంగా కంపార్టుటెంట్లు



తుప్పుపట్టిన మిషన్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరులో సంపద తయారీ కేంద్రం శిథిలమై మూతపడింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ కేంద్రం సమర్థవంతంగా పని చేయగా కూటమి పాలనలో సంపద తయారీ కేంద్రానికి గ్రహణం పట్టుకుంది. విలువైన పరికరాలు తప్పుపట్టాయి. అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది.

వివరాల్లోకి వెళితే..

మున్సిపాలిటీ పరిధిలో మొత్తం నాలుగు సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. యనమలకుదురు, పోరంకి, తాడిగడప, కానూరు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. రూరల్ పరిధిలో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాలు అదనం. అయితే కానూరులో ఉన్న సంపద తయారీ కేంద్రం పూర్తి హంగులతో ఏర్పాటయింది. ఆశించిన మేర ఫలితాలను కూడా చూపించింది. మిగతా మూడు అంతంతమాత్రంగా పనిచేస్తున్నాయి.

కానూరులో రూ.15 లక్షలతో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సంపద తయారీ కేంద్రాలు తాడిగడప మున్సిపాలిటీలో ఏర్పాటు చేశారు. ప్రధానంగా కానూరులో ఉపాధి హామీ నిధులు సుమారు రూ.15 లక్షలకు పైగా ఖర్చు చేసి భారీ షెడ్డు నిర్మాంచారు. ఈ కేంద్రంలో 38 కంపార్టుమెంట్‌లు, తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేరు చేసే రెండు మిషన్‌లు కూడా పెట్టారు. ప్రతి ఇంటికీ తడి చెత్త, పొడి చెత్త సేకరణకు రెండు డస్టుబిన్‌లు కూడా పంపిణీ చేశారు. ప్రత్యేక వాహనాలు ఇంటింటికీ తిరిగి తడి చెత్త, పొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రం యూనిట్‌కు తరలించే వారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంపద తయారీ కేంద్రంలో పూర్తి స్థాయిలో ఎరువుల ఉత్పత్తి జరిగింది.

మూతపడిన యూనిట్

కాగా ఎంతో ఖర్చు చేసి నిర్మించిన యూనిట్ నేడు పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూతపడింది. ప్రస్తుతం కానూరులో తడి చెత్త, పొడి చెత్త సేకరణ జరగటం లేదు. గ్రామంలో రోజుకు 15 టన్నుల చెత్త వస్తుండగా సంపద తయారీ కేంద్రానికి చెత్త తీసుకు రావటం లేదు. చెత్త తీసుకు వచ్చి ప్రధాన రహదారుల పక్కనే డంప్ చేసి తగులపెడుతున్నారు. ఇక సంపద తయారీ కేంద్రం వద్ద సిబ్బంది సైతం కనబడటం లేదు. ఇంటింటికీ చెత్త సేకరించే వాహనాలు కూడా కనుమరుగయ్యాయి.

కనిపించని స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర..

నేడు కానూరులో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. దోమలు విజృంభిస్తున్నాయి. పాలకులు పారిశుద్ధ్యంపై కనీసం స్పందించటం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సంపద తయారీ కేంద్రం వద్ద పూలమొక్కలతో పార్కు ఉండేది. ఇప్పుడు ఎండిపోయిన మొక్కలు దర్శనమిస్తున్నాయి. పూల మొక్కలు అన్నీ చనిపోయాయి. సంపద తయారీ కేంద్రాలపై తరచుగా ఊకదంపుడు ప్రసంగాలు చేస్తున్న డెప్యూటీ సీఎం హామీలు మాటలకే పరిమితమయ్యాయి. స్వచ్ఛాంధ్ర ఆనవాలు కానూరులో కనబడటం లేదు.

తుప్పుపడుతున్న మిషన్‌లు..

ఇక సంపద తయారీ కేంద్రం యూనిట్‌లో ఏర్పాటు చేసిన రెండు మిషన్‌లు తుప్పుపట్టి పనికి రాకుండా ఉన్నాయి. సంపద తయారీ కేంద్రంలోని 38 కంపార్టుమెంట్లలో చెత్తా చెదారం కనబడుతోంది. యూనిట్‌లోని ఇతర గదులు, టాయిలెట్‌లు ధ్వంసమయ్యాయి. కరెంట్ వైర్లు పీకేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

పాలకుల్లో చిత్తశుద్ధి లేదు..



సంపద తయారీ కేంద్రాన్ని సమర్థవంతంగా నడిపించే చిత్తశుద్ధి పాలకుల్లో కనబడటం లేదు. పని చేస్తున్న కేంద్రాన్ని నిర్లక్ష్యంతో మూసివేశారు. కానూరులో చెత్త కుప్పలు ఎక్కడపడితే అక్కడ ఉన్నా చర్యలు లేవు. గ్రామంలో పూర్తి అనారోగ్య వాతావరణం ఉంది. పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది.

– వల్లూరు భాస్కరరావు, కానూరు

కిశోర వికాసంపై అవగాహన



వణుకూరులో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు



రామవరప్పాడులో కిశోర వికాసం 2.0 ప్రారంభిస్తున్న బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు



కంకిపాడులో ర్యాలీలో కిశోర బాలికలు, అంగన్‌వాడీ సిబ్బంది



క్రిస్టియన్‌పేటలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెనమలూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో కిశోర వికాసంపై వేసవి శిబిరం శనివారం నిర్వహించారు. వణుకూరు, గంగూరు, గోసాల గ్రామాల్లోని మొత్తం ఆరు సచివాలయాల పరిధిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించటం, బాల్య వివాహాల వలన అనర్థాలు, చదువుకోవటం వలన కలిగే లాభాలు, పలు అంశాలు బాల బాలికలకు వివరించారు. ఐసీడీఎస్ అధికారులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కిశోర వికాసం 2.0 ప్రారంభం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పీఎస్‌ఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం 2.0 కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో యుక్త వయస్సు బాలికల కొరకు వేసవి ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌమార బాలికల సాధికారతలో భాగంగా ఒకరినొకరు పరిచయం చేసుకుని లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగలక్ష్మి పాల్గొన్నారు. ఈ వేసవి ప్రత్యేక శిబిరం వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కంకిపాడు: కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. కంకిపాడు పట్టణంలో కిశోర వికాసం సమ్మర్‌క్యాంపు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి జి.రమ, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.నళినీకుమారి, టీ కృష్ణవేణి, డ్వాక్రా వీఓఏ రమ్యకృష్ణ, ఆశ కార్యకర్తలు దుర్గ, పార్వతి, దుర్గా భవాని పాల్గొన్నారు. కోలవెన్ను శివారు క్రిస్టియన్‌పేటలో కిశోర వికాసం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఏఎన్ఎంపద్మ, మహిళా సంరక్షణ కార్యదర్శి శాంతి కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టరు ఆవిష్కరిస్తున్న భక్త బృందం

ఉయ్యూరు: హనుమాన్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించాలని సరసభారతి అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ కోరారు. ఉయ్యూరు పట్టణంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఈనెల 22న నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర పోస్టరును శనివారం ఆవిష్కరించారు. శోభాయాత్ర కమిటీ ప్రతినిధులు గబ్బిట వెంకట రమణ, రాపిరెడ్డి హరీష్, యారా సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఉయ్యూరు పట్టణంలోని రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో ఆయా కమిటీల ప్రతినిధులతో కలిసి పోస్టరును ఆవిష్కరింపచేశారు. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ ప్రతినిధి రమణ మాట్లాడుతూ గురువారం సాయంత్రం 4 గంటలకు బస్టాండ్ సెంటరులోని శ్రీదాసాంజనేయ స్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణతో భక్తిభావంతో శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు.

ప్రత్యేక శిక్షణ తరగతులపై ఉపాధ్యాయుల అసహనం



నున్న జిల్లా పరిషత్ హైస్కూల్

విజయవాడరూరల్: రాష్ట్ర విద్యాశాఖ పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ప్రత్యేక శిక్షణ తరగతులను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించాలని ఆదేశించడం పట్ల ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత నెల 30వ తేదీ నుంచి ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించాలని ఆదేశించడంతో ఆ విధంగానే నిర్వహించారు. అయితే ఈ నెల 2వ తేదీ నుంచి సమయాలను మార్చారు. మండుతున్న ఎండల్లో సైతం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు తరగతులను నిర్వహించాలనే ఆదేశాలతో ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు కుటుంబ సమేతంగా బంధువుల ఇళ్లకు వెళ్లాలని, టిక్కెట్లు అడ్వాన్స్ బుకింగ్ చేయించుకున్న ఉపాధ్యాయులు విద్యాశాఖ నుంచి వచ్చిన ప్రత్యేక శిక్షణ తరగతుల సమాచారంతో నిరాశకు గురయ్యారు. ప్రత్యేక శిక్షణ తరగతులు ఈ నెల 18వ తేదీ వరకు నిర్వహించాలనే ఆదేశాలు మానసిక క్షోభను కలిగిస్తున్నాయని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు.

సందడిగా వేసవి శిక్షణ శిబిరాలు



వణుకూరులో విద్యార్థులకు మ్యూజికల్ చైర్ నిర్వహిస్తున్న సిబ్బంది



కంకిపాడు గ్రంథాలయంలో పుస్తక పఠనం



తెన్నేరు గ్రంథాలయంలో క్యారమ్స్‌లో శిక్షణ



ఉయ్యూరులో చెస్ శిక్షణ పొందుతున్న చిన్నారులు



గన్నవరంలో స్పోకెన్ ఇంగ్లిష్ క్లాస్‌కు హాజరైన విద్యార్థులు

పెనమలూరు: గ్రంథాలయ శాఖ వేసవి శిక్షణ శిబిరం వణుకూరు గ్రామంలో సందడిగా జరుగుతోంది. గ్రంథాలయంలో శనివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కథలు చెప్పించారు. డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం మ్యూజికల్ చైర్స్ పోటీ నిర్వహించగా విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. దాదాపు 38 మంది విద్యార్థులు పాల్గొన్నారని శాఖ గ్రంథాలయ అధికారి భారతి తెలిపారు.

అన్ని రంగాల్లోనూ ప్రతిభ చాటాలి

కంకిపాడు: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని వక్తలు సూచించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా తెన్నేరు శాఖా గ్రంథాలయంలో శనివారం భగవద్గీత శ్లోకాల పారాయణం, క్యారమ్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నీతి కథలు చెప్పించారు. అందులోని నీతిని విద్యార్థులకు వివరించారు. శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిబిరాల్లో పుస్తక పఠనం చేయించారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. రైల్వే సూపరింటెండెంట్ కె.రాంబాబు, ఎస్.అప్పారావు, పి.సురేష్‌బాబు, గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

వేసవి శిక్షణతో మేలు

ఉయ్యూరు: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఉపయుక్తమని గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఏ.కృష్ణమోహన్ అన్నారు. ఉయ్యూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థుల శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. గ్రంథాలయంలో రికార్డులు పరిశీలించి పుస్తకాలపై ఆరా తీశారు. విద్యార్థుల పుస్తక పఠనం, ఆట, పాటలు, శిక్షణ తరగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రమణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజ్ఞాన తరగతులు

గన్నవరం: మండలంలోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుస్తక పఠనం, చిత్రలేఖనం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో పఠనాభిలాషను పెంపొందించి, వారిలోని సృజనాత్మ శక్తిని ప్రోత్సాహించేందుకు విజ్ఞాన శిబిరం దోహదపడుతుందన్నారు. విశ్రాంత ఉద్యోగి ధర్మారావు, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ పీడీ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పురుషోత్తపట్నం, ముస్తాబాద గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు.

చరిత్ర పుస్తకాల పరిచయం..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరంలో శనివారం విద్యార్థులకు విజయనగర సామ్రాజ్య చరిత్ర పుస్తకాలను పరిచయం చేశారు. తెలుగుభాష, కవులు, రచనలకు శ్రీకృష్ణదేవరాయుల కాలంలో లభించిన ఆదరణ, అష్టదిగ్గజాలను విద్యార్థులకు గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి వివరించారు. లూడో, క్యారమ్స్, త్రోబాల్ ఆటలు నేర్పించటంతో పాటుగా, నృత్య శిక్షణ నిర్వహించారు.

కలుషిత నీటిని పరిశీలించిన అధికారులు

కొత్తపైపులైన్లు ఏర్పాటు చేస్తాం: డీఈ

సాక్షి ఎఫెక్ట్..



యనమలకుదురులో నీటి విషయమై గ్రామస్తులతో మాట్లాడుతున్న మున్సిపాలిటీ అధికారులు

పెనమలూరు: యనమలకుదురు గ్రామం ఇందిరానగర్–2లో కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తున్న ఘటన పై చర్యలకు మున్సిపాలిటీ అధికారులు రంగంలోకి దిగారు. సాక్షి దినపత్రికలో శనివారం 'నీరు ఇలా.. తాగేది ఎలా?' శీర్షికన కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించారు. తాడిగడప మున్సిపాలిటీ ఏఈ సాయిగణేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఇందిరానగర్‌లో కుళాయిల నుంచి వస్తున్న నీటిని పరిశీలించారు. బోరు నుంచి వస్తున్న తాగునీరు కలుషితంగా ఉంటే తాము ఎలా తాగాలని స్థానికులు ఏఈ దృష్టికి తీసుకు వచ్చారు. కొళాయిల్లో వస్తున్న కలుషిత నీటిపై ఏఈ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై డీఈ రాజారావు వివరణ ఇస్తూ కొత్తగా బోర్ వేయటం వలన నీరు రంగు మారి కొద్ది సమయం వస్తోందన్నారు. పాత పైప్‌లైన్స్ తొలగించి రూ.10 లక్షలతో కొత్త పైప్‌లైన్‌లు వేయటానికి అంచనాలు సిద్ధం చేశామన్నారు. వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని డీఈ తెలిపారు.

చోడవరంలో..

చోడవరంలో కలుషిత నీరు సరఫరాపై కూడా గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత స్పందించారు. వాటర్ ట్యాంక్ క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తామన్నారు. ఇళ్లకు వచ్చే పైప్‌లైన్‌లు తప్పుపట్టాయని, గృహ యజమానులు మార్చుకోవాలని, దీనికి వెంటనే అనుమతులు ఇస్తామన్నారు.

రేపటి నుంచి ఆధార్ శిబిరాలు

కంకిపాడు: ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎన్.బసవయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 5న చలివేంద్రపాలెం పంచాయతీ, 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కంకిపాడు పంచాయతీ కార్యాలయం, 5, 6వ తేదీల్లో ఈడుపుగల్లు పంచాయతీ కార్యాలయం, 7, 8 తేదీల్లో మద్దూరు పంచాయతీ కార్యాలయాల్లో శిబిరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రోగులను నిర్లక్ష్యం చేస్తే సహించం



కంకిపాడు: రోగులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, సిబ్బంది పనితీరుపై సమీక్ష చేశారు. మందుల కొరత లేకుండా చూడాలని, మెరుగ్గా సేవలు అందించాలని సూచించారు. తనిఖీలో సీహెచ్‌సీ చైర్మన్ రోహిణీకుమారి, స్థానిక నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, చలవాది రాజా, అన్నే రామారావు, పులి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ..


స్థానిక మార్కెట్ యార్డులో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రైతులకు పంపిణీ చేశారు. కంకిపాడు, ఉయ్యూరు మండల వ్యవసాయాధికారులు పీఎం కిరణ్, నిస్సీగ్రేస్ పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

[illegible]

పేరుపల్లి — వై. హరిబాబ్, న్యాయవాది
✆ 9848121485

మాకొద్దీ ఫుడ్ బాక్సులు





నున్న(విజయవాడరూరల్): రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం జనసమీకరణ కోసం బస్సుల్లో ఏర్పాటు చేసిన ఫుడ్ బాక్సులను కొంతమంది మహిళలు తిరస్కరించడంతో శనివారం వాటిని చెత్తసేకరించే వాహనాల్లో బయటకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, జక్కంపూడి, కె.తాడేపల్లి గ్రామాలకు శుక్రవారం పంపిన బస్సుల్లో తాగునీరు, ఫుడ్‌బాక్సులు, రెండు అరటి పండ్లు, ఉప్మాను ప్రభుత్వం పంపారు. వీటిని గురువారం రాత్రే తయారు చేశారని సమాచారం. అయితే బస్సులు ఎక్కే సమయానికే ఫుడ్‌బాక్సులు దుర్వాసన రావడంతో చాలా మంది మా కొద్దీ ఫుడ్ బాక్సులంటూ వదిలేసి బస్సుల్లో వెళ్లారు. ఈ ఆహారం తీసుకుంటే అనారోగ్యాలకు గురవుతామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే నున్న గ్రామం చెరువు సెంటర్లో శనివారం వరకు ఆ ఫుడ్ బాక్సులు అలాగే ఉండటంతో అధికారులు హడావిడిగా వాటిని దూర ప్రాంతాల్లో వదిలేయాలని ఆదేశించడంతో వాటిని చెత్త సేకరించే వాహనాల్లో తరలించారు.

'వెబ్ డెవలపర్' శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్ సెంటర్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ నిమిత్తం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీవీ. కృష్ణమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల వ్యవధి కలిగిన ఈ కోర్సును అభ్యసించేందుకు ఇంటర్, డిగ్రీ, డిప్లమో చదివిన 16 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. శిక్షణ అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కోర్సు గుర్తింపు సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఆధార్ జిరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో స్కిల్‌హబ్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. ఇతర సమాచారం కోసం 94940 05725 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.